సాక్షి
నంద్యాల
ఆదివారం । 14 । జూలై । 2024



కనుల పండువగా ఆరాధన

మంత్రాలయం: శ్రీమఠం పూర్వ పీఠాధిపతి వరదేంద్ర తీర్థుల ఉత్తరారాధన వేడుకలు పూణేలో ఘనంగా జరిగాయి. శ్రీ మఠం పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థులు ప్రత్యేక అభిషేకాలు చేశారు.



మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో శనివారం వీకెండ్ భక్తుల సందడి నెలకొంది. స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వార్లను దర్శించుకున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,607
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 31.5
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 18,060
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 210

న్యూస్‌రీల్

ఒక్క రోజు రూ.3.17 లక్షల ఆదాయం



భక్తులతో కిక్కిరిసిన మద్దిలేటి నరసింహస్వామి ఆలయం

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి ఆషాఢ మాసం శనివారం సందర్భంగా జిల్లా నలు మూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. క్షేత్రానికి చేరుకున్న భక్తులు వివిధ సేవలు నిర్వహించుకోవడంతో దేవస్థానానికి రూ.3,17,065 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

లొద్ది మల్లయ్య జాతరకు రావొద్దు

శ్రీశైలంప్రాజెక్ట్: తెలంగాణాలోని అచ్చంపేట నల్లమల అటవీ డివిజన్‌లో తొలి ఏకాదశి సందర్భంగా ఏటా నిర్వహించే లొద్దిమల్లయ్య జాతరకు భక్తులు తరలిరావొద్దని అచ్చంపేట ఫారెస్ట్ డివిజన్ అధికారులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం వన్యప్రాణుల పునరుత్పత్తి సమయమని, ఈ పరిస్థితుల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తే వాటి పునరుత్పత్తికి ఆటంకం కలిగే అవకాశముందని పేర్కొన్నారు. అటవీ శాఖ నిబంధనలు అతిక్రమించే భక్తులకు జరిమానా విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

డిప్లొమా సెకండియర్‌కు స్పాట్ అడ్మిషన్లు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని పాలిటెక్నిక్, ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్ వృత్తి విద్యాకోర్సు ద్వారా డిప్లొమో ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ శనివారం తెలిపారు. సంబంధిత దరఖాస్తులను ఈనెల 16వ తేదీలోగా పాలిటెక్నిక్ కళాశాలలో అందజేయాలన్నారు. స్పాట్ అడ్మిషన్లను ఈనెల 18వ తేదీన కర్నూలు పట్టణంలోని మైనార్టీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు httpr://aprbsret.in/ ivc. లేదా httpr://prbsret.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఇంటర్ వృత్తి విద్యాకోర్సు పూర్తి చేసి డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో అభ్యర్థులు తాము చేరాల్సిన కళాశాలలో అప్లికేషన్ ఇచ్చిన తర్వాత 18వ తేదీ పాలిటెక్నిక్ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో రెండు సెట్ల జిరాక్స్, రెండు ఫొటోలు తీసుకొని రావాలని తెలిపారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్‌తో పాటు ప్రాసెసింగ్ రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అలాగే స్పాట్ అడ్మిషన్‌లో సీటు వచ్చిన వారు ప్రభుత్వ కళాశాలలో రూ.4,700, ప్రైవేటు కళాశాలలో రూ.25 వేలు రుసుం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

'చలో ముచ్చుమర్రి'కి తరలిరండి

నంద్యాల(అర్బన్): అదృశ్యమైన బాలిక ఆచూకీని గుర్తించడంలో ప్రభుత్వం, పోలీసుల వైఫల్యాన్ని నిరసిస్తూ ఆదివారం చేపట్టిన 'చలో ముచ్చుమర్రి' కార్యక్రమానికి విద్యార్థి, మహిళా, ప్రజా సంఘాల నాయకులు తరలిరావాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులి కొండన్న కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు హోంమంత్రి అనిత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఈ విషయంపై స్పందించక పోవడం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు, బాలిక కుటుంబ సభ్యులకు న్యాయం జరగాలన్నారు.

ముగిసిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

కర్నూలు సిటీ: ఏపీ ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా వెబ్ ఆప్షన్లు, మార్పులు చేసుకునే గడువు శనివారంతో ముగిసింది. ఈఏపీ(ఎంపీసీ స్ట్రీమ్) కౌన్సెలింగ్‌కు ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు 4 నుంచి 7వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేశారు. 8వ తేది నుంచి 12 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వగా, వాటిని మార్పులు చేసుకునే సమయం సైతం శనివారంతో ముగిసింది. వీరికి ఈ నెల 16న సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీట్లు పొందిన వారికి ఆయా కాలేజీల్లో 19వ తేదీ నుంచి తరగతులు మొదలు కానున్నాయి.

పాలీసెట్ కౌన్సెలింగ్..

పాలీసెట్–2024 తుది విడత కౌన్సెలింగ్ ముగిసింది. ఈ నెల 11వ తేది నుంచి మొదలైన ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు గడువు శనివారంతో ముగిసింది. ఆన్‌లైన్‌లో ఫీజుల చెల్లించిన వారు వెబ్ ఆప్షన్ల గడువు సైతం నేటి (ఆదివారం)తో ముగియనుంది.

నల్లమలకు గజ వైభవం



జీవ వైవిధ్యానికి నిలయమైన నల్లమల అడవి మరో ప్రత్యేకతను సంతరించుకుంటోంది. ఇప్పటికే పెద్ద పులులు, చిరుతలతో పులకిస్తున్న అభయారణ్యంలో నెల క్రితం అడవి దున్న ప్రత్యక్షం కావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ క్రమంలోనే నల్లమలకు గజరాజులు రాబోతున్నాయి. అటవీలో గస్తీని మరింత పెంచేందుకు ఫారెస్ట్ అధికారులు ఏనుగుల సహాయం తీసుకుంటున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే మరో రెండు నెలల్లో నల్లమలలో ఏనుగులు కనిపించబోతున్నాయి.

- అటవీ సంరక్షణ విధుల్లోకి ఏనుగులు
- కేంద్ర అటవీ పర్యావరణ శాఖకు ప్రతిపాదనలు
- ఏనుగుల కోసం కర్ణాటక ప్రభుత్వానికి విజ్ఞప్తి

ఆత్మకూరురూరల్: దేశంలోనే విస్తీర్ణంలో అతి పెద్దదైన నాగార్జున సాగర్ – శ్రీశైలం పులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్)లో పులుల సంరక్షణకు మరింత సమీకృత చర్యలు అవసరమని, అందులో ఏనుగులు కీలకమని ఇక్కడ పని చేసిన ఫారెస్ట్ అధికారులు ఎప్పటి నుంచో ఆలోచన చేశారు. వారి కలలను నిజం చేస్తూ నల్లమలకు త్వరలో ఏనుగులు రాబోతున్నాయి. నల్లమల అభయారణ్యంలో విలువైన కలపతో పాటు అరుదైన వన్యప్రాణులు ఉన్నాయి. వన్యప్రాణి సంరక్షణకు, విపత్కర అవసరాల కోసం ఒక అనిమల్ రెస్క్యూ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో వన్యప్రాణి వైద్యులతో పాటు, మత్తు సూదులను జంతువులపై ప్రయోగించే షార్ప్ షూటర్‌లను కూడా అందుబాటులో ఉంచారు. ఇదే కోవలో మరింత వన్యప్రాణి సంరక్షణ పద్ధతులను చేర్చడంలో భాగంగానే ఎనిమిది శిక్షణ పొందిన ఏనుగులను ఎన్ఎస్‌టీఆర్‌కు రప్పిస్తున్నారు. ఈ మేరకు ఎన్ఎస్‌టీఆర్ ఎఫ్‌డీ పీటీ బీఎస్ఎన్ మూర్తి కేంద్ర వైల్డ్‌లైఫ్ బోర్డ్‌కు ప్రతిపాదనలు పంపారు. త్వరలో అక్కడ నుంచి అనుమతులు రాగానే అవసరం మేరకు కావాల్సిన ఏనుగుల ఎంపిక జరుగనుంది. ఇప్పటికే ఏనుగుల కోసం కర్ణాటక ప్రభుత్వానికి కూడా అనుమతుల కోసం విజ్ఞాపనలు పంపారు. పెద్దపులుల ప్రవర్ధనానికి స్వర్గం లాంటి ఎన్ఎస్‌టీఆర్, గుండ్ల బ్రహ్మేశ్వరం (జీబీఎం) వన్యప్రాణి అభయారణ్యాలలో ఈ శిక్షణ పొందిన ఏనుగులను వినియోగించనున్నారు. ప్రస్తుతం లోతట్టు అటవీ ప్రాంతాల్లో అటవీ సిబ్బంది వంతుల వారీగా వివిధ కంపార్ట్‌మెంట్లలో ఫుట్ పెట్రోలింగ్ చేస్తుంటారు. అలాంటి సమయాల్లో సిబ్బంది తరుచూ ఎలుగు బంట్ల దాడులకు గురవుతుంటారు. ఇలాంటి చోట్ల ఏనుగులపై నుంచి పెట్రోలింగ్ చేస్తే ఎలుగు బంట్ల నుంచి రక్షణ కలగడంతో పాటు కాస్త ఎక్కువ దూరం గస్తీ నిర్వహించే అవకాశం ఉంటుంది.

ఆపద సమయంలో చేరువకు..

వివిధ కారణాలతో ఉచ్చులలో చిక్కుబడే మాంసాహార వన్యప్రాణులను ఉచ్చుల నుంచి విడిపించడం అటవీ శాఖాధికారులకు కత్తిమీద సాముగా మారుతోంది. దూరం నుంచి తుపాకీ ద్వారా మత్తు సూదులను ప్రయోగించడంలో గురి తప్పే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో వాటి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అదే ఏనుగుపై నుంచి షార్ప్ షూటర్ వన్యప్రాణి సమీపంలోకి వెళ్లి మత్తు సూది వేసి కాపాడవచ్చు.

సండే స్పెషల్

గుంపు ఏనుగుల దారి మళ్లింపు సులభం

ఆంధ్రప్రదేశ్‌లో విజయనగరం, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లోని అడవుల నుంచి అప్పుడప్పుడు జనవాసాల్లోకి అడవి ఏనుగులు వస్తూ విధ్వంసం సృష్టిస్తాయి. అపుడు వాటిని దారి మళ్లించి అడవుల్లోకి పంపడం అధికారులకు పెద్ద రిస్క్‌తో కూడిన వ్యవహారంగా ఉంటుంది. ఆ పరిస్థితుల్లో అధికారులు పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక, ఒడిశా ప్రాంతాలను నుంచి పెంపుడు ఏనుగులను రప్పించి అడవి ఏనుగుల గుంపును తరుముతుంటారు. ఎన్ఎస్‌టీఆర్‌కు వస్తున్న ఏనుగులను అవసరమనుకున్నప్పుడు అడవి ఏనుగుల నియంత్రణకు కూడా వినియోగించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

మూడు దశాబ్దాల క్రితమే ప్రయత్నం..

1996 ప్రాంతంలో ఆత్మకూరు అటవీ డివిజన్‌కు ముఖ్య అధికారి (డీఎఫ్ఓ)గా పనిచేసిన రమణ మూర్తి నల్లమలకు ఏనుగును రప్పించేందుకు ప్రయత్నాలు కూడా చేసినట్లు తెలిసింది. శేషాచలం అడవుల్లో ఉన్న ఏనుగులు కడప జిల్లా సరిహద్దులకు వస్తుండడంతో వాటిని నల్లమలకు రప్పించడం పెద్ద పనికాదని ఆయన భావించే వారు. ఇందుకోసం తన వద్ద ఉన్న ప్రణాళికలను ఉన్నతాధికారులకు ఆయన నివేదించారు కూడా. అయితే శేషాచలం కొండలకు నల్లమలకు మధ్యలో బద్వేల్ ప్రాంతంలో అడవి పూర్తిగా మాయమై మైదానం ఏర్పడి ఉండడం ఈ ప్రయత్నాలకు మొదలే అడ్డుకట్ట పడడానికి కారణమైంది. అయితే ఎన్ఎస్‌టీఆర్‌లో దినదిన ప్రవర్ధమానమవుతున్న పెద్దపులిని శేషాచలం చేర్చడంలో మాత్రం అటవీ అధికారులు సఫలీకృతమైనారు. శ్రీశైలం – శేషాచలం టైగర్ కారిడార్ ఒక ఫలవంతమైన ప్రాజెక్ట్‌గా నిలిచింది. శ్రీశైలం నుంచి పెద్ద పులి నేడు తిరుమల శేషాచలం అడవుల్లో కూడా కనిపిస్తోంది.

ప్రాచీన కాలంలో..

నల్లమలలో ఒకప్పుడు ఏనుగులు సంచరించాయనడానికి కొన్ని ఆనవాళ్లు ప్రాచీన చరిత్ర భద్రపరిచింది. ప్రస్తుతం నల్లమలలోని ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో ఉన్న కరివేన గ్రామం ఉన్న ప్రాంతాన్ని ప్రాచీన కాలంలో కరివనంగా పిలిచేవారని గ్రామానికి చెందిన పండితులు చెబుతున్నారు. కరి అంటే సంస్కృతంలో ఏనుగనే అర్థం. ఏనుగులు సంచరించే ప్రాంతం కావడంతో దీన్ని కరివనంగా పిలిచే వారట. ఇక్కడికి సమీపంలో ఉన్న నల్లకాల్వ గ్రామానికి కూడా ఈ చరిత్రలో చోటుంది. నల్లకాల్వ గ్రామం పూర్వనామం నల్లకలువ. ఒకప్పటి దట్టమైన అరణ్యమైన ఈ ప్రాంతంలో ఉన్న కొలనులో నల్లకలువలు ఉండేవట. కరివనంలో ఉండే ఏనుగులు నల్లకాల్వ ప్రాంతంలో ఉన్న కొలనులోని కలువలను ఆహారంగా స్వీకరించేందుకు వచ్చేవని గ్రామ చరిత్ర వల్ల తెలుస్తోంది. ఈ ఆధారాల కారణంగా నల్లమలలో ఏనుగుల సంచారం ఉండేదని స్పష్టమవుతుంది.



బ్రిటీష్ పాలనలో..

నల్లమలలో విలువైన కలప తరలించేందుకు బ్రిటీష్ పాలకులు విరివిగా ఏనుగులను వినియోగించినట్లు అటవీ శాఖ పని విధానంలో తెలుస్తోంది. నల్లమలలోని పెచ్చెర్వు, గుండ్ల బ్రహ్మేశ్వరం వంటి ఎత్తైన అటవీ ప్రాంతాల్లో విస్తారంగా టేకు, నల్లమద్ది, జిట్టేగి, ఏగి తదితర మహావృక్షాలు ఉండేవి. వీటిని బ్రిటీష్ అధికారులు నరికించి మైదాన ప్రాంతానికి తరలించేందుకు ఏనుగులను వినియోగించే వారు. వీటిని నడిపించేందుకు స్థానికంగానే మావటీలను కూడా ఏర్పాటు చేసుకునేవారు. ఆత్మకూరు పట్టణంలో ఇప్పటికి హత్తి (హాథీ)వాలే అనే వంశం ఉంది. ఈ వంశంలోని పలు కుటుంబాలను ఇప్పటికి ఈ పేరుతోనే పిలుస్తుంటారు. ఈ వంశానికి చెందిన వారు ఏనుగులను నడిపించేందుకు, వాటికి హారం, నీరు అందించేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందే వారట. కాలక్రమేణ వచ్చిన మార్పులతో రవాణా పద్ధతులు మారడంతో క్రమేపి ఏనుగులు నల్లమలను వీడాయి. వాటిని పోషించిన వారికి మాత్రం ఏనుగులు ఇంటిపేరుగా (హాథీవాలే) నిలిచి పోయింది.

ఏనుగుల కోట..

నల్లమలలో ఏనుగులు సంచరించాయనడానికి ఇప్పటికీ ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని అరణ్యంలో ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. నల్లకాల్వ గ్రామం నుంచి రుద్రకోడు వెళ్లే మార్గంలో ఏనుగుల కోట అనే ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో ఏనుగులు అధికంగా సంచరించడం వల్ల ఆ ప్రాంతాన్ని ఏనుగుల కోటగా పిలిచే వారని పెద్దలు చెబుతుంటారు.

- వెలుగోడు రేంజ్‌లో గుండ్లబ్రహ్మేశ్వరం సమీపంలో దంతాల తిప్ప అనే కొండ ఉంది. ఇది ఏనుగుల దంతాల కారణంగానే చరిత్రలో ఒక కొండ గుర్తుగా మిగిలింది. ఈ కొండ దిగువన ఉన్న ఒక గుహ వద్ద ఏదైనా అలికిడి అయితే అది కొండమీద ప్రతిధ్వనించేదట. కొండమీద ఉండే నీటి దొరువు వద్దకు దప్పిక తీర్చుకునేందుకు వచ్చే ఏనుగులు ఈ ధ్వని హెచ్చరికతో జన సంచారాన్ని గుర్తించి దూరం వెళ్లేవని చెబుతుంటారు.

రెండు నెలల్లో రావొచ్చు



ఎనిమిది ఏనుగులను ఎన్ఎస్‌టీఆర్‌లో రక్షణ విధులకు వినియోగించడం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అదే సమయంలో ఏనుగుల కేటాయింపు కోసం కర్ణాటక ప్రభుత్వాన్ని కూడా సంప్రదిస్తున్నాం. రెండు నెలల్లో ఎనిమిది ఏనుగులు వస్తాయని భావిస్తున్నాం. నీటి వసతి ఉన్న పర్వత ప్రాంతమైన జీబీఎం, వెలుగోడు నార్త్ బీట్‌లోను ఏనుగులతో సిబ్బంది పెట్రోలింగ్ చేయనున్నారు.

– బీఎల్ఎస్ మూర్తి, ఎఫ్‌డీపీటీ ఎన్ఎస్‌టీఆర్

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్యసేవలపై రోగులను ఆరా తీస్తున్న కలెక్టర్ రాజకుమారి

బొమ్మలసత్రం: ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ జి. రాజకుమారి ప్రభుత్వ వైద్యులకు సూచించారు. శనివారం స్థానిక సర్వజన వైద్యశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. అధునాతన వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఆసుపత్రిలోని ఎంసీహెచ్ విభాగం, అత్యవసర విభాగం, శస్త్ర చికిత్సల గదులను క్షుణ్ణంగా పరిశీలించి, మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన వాటిపై నివేదిక సమర్పించాలని వైద్యులకు సూచించారు. అలాగే రోగుల కోసం ఏర్పాటు చేసిన ఎమ్మారై, సిటీ స్కానింగ్ విభాగాలను పరిశీలించి రోజుకు ఎంత మంది సేవలు పొందుతున్నారన్న విషయంపై ఆరా తీసి వివరించారు. అవసరమయ్యే పరికరాలను ఆసుపత్రి నిధుల నుంచి కొనుగోలు చేసి వినియోగించాలని సూచించామన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రసాదరావు మాట్లాడుతూ ఆసుపత్రికి రోజూ 1,400 మంది రోగులు వైద్య చికిత్సలు పొందుతున్నారని అందుకు తగ్గ సౌకర్యాలు ఆసుపత్రిలో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అలాగే వైద్య సిబ్బంది కొరత ఆసుపత్రిని వేధిస్తుందని, కార్డియాలజీ, సూపర్‌స్పెషాలిటీ వైద్యుల కొరత ఉందన్నారు. కలెక్టర్ వెంట డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా తదితరులు ఉన్నారు.

జిల్లా ఎస్పీగా అధిరాజ్‌సింగ్ రాణా



బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా ఎస్పీగా అధిరాజ్‌సింగ్ రాణాను నియమిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను నంద్యాలకు బదిలీ చేశారు. నూతన జిల్లాగా ఆవిర్భావమైనప్పటి నుంచి నంద్యాల ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రఘువీర్‌రెడ్డిని డీజీపీ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పలు మండలాల్లో వర్షం

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా శ్రీశైలంలో 25.4 మి.మీ, అత్యల్పంగా శిరివెళ్లలో 0.4 మి.మీల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. కొత్తపల్లి 18.2 మి.మీ, ఆత్మకూరు 9.8, బనగానపల్లె 6.6, పగిడ్యాల 5.2, మహానంది 4.2, పాములపాడు 4, వెలుగోడు 2.4, జూపాడుబంగ్లా 2.2, నందికొట్కూరు 1.2 మి.మీ మేర వర్షపాతం నమోదైంది.

నిజాన్ని నీళ్లలో ముంచి.. దర్యాప్తును దారి మళ్లించి!

- బాలిక అదృశ్యం కేసులో మాట మార్చుతున్న నిందితులు
- పోలీసులకు చుక్కలు చూపిస్తున్న మైనర్లు
- ఏడో రోజూ కనిపించని బాలిక ఆచూకీ
- డీఐజీ సమక్షంలో పాత ఎల్లాల తిప్ప వద్ద గాలింపు



కృష్ణానదిలో గాలింపు చర్యల్లో పాల్గొన్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం, పోలీసులు

పగిడ్యాల/కొత్తపల్లి: వారం రోజులు గడిచినా ముచ్చుమర్రిలో బాలిక అదృశ్యం కేసు మిస్టరీ ఇంకా వీడలేదు. నిందితులు రోజుకో మాట మార్చుతూ పోలీసులను ముప్పు తిప్పలు పెడుతున్నట్లు తెలుస్తోంది. బాలిక ఆచూకీ గుర్తించడం ఆలస్యమవుతుండటంతో కుటుంబీకులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం డీఐజీ విజయారావు, ఎస్పీ రఘువీర్‌రెడ్డి సమక్షంలో నిందితుడిగా అనుమానిస్తున్న ఓ బాలుడు చెప్పిన సమాచారం మేరకు పాత ఎల్లాల తిప్ప వద్ద కృష్ణానదిలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు స్పీడ్ బోట్లతో అణువణువునా గాలించారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో నిందితుల్లో ఒకరిని పోలీసులు పదే పదే ప్రశ్నించి నదిలో సంగమేశ్వరం వరకు గాలించినా ఆచూకీ మాత్రం కనిపించ లేదు. అయితే నిందితుడు పోలీసులకు తప్పుడు సమాచారం ఇస్తున్నాడని, బాలికను చంపేసి నీళ్లలో వేస్తే రెండు, మూడు రోజుల్లోగా మృతదేహం తప్పకుండా బయటపడుతుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. మృతదేహం ఆనవాలు కనిపించకుండా కాల్చి బూడిద చేసి నదిలో కలిపేశారా.. అంటూ కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాలిక ఆచూకీ కోసం ఆయా గ్రామాల ప్రజలు ముచ్చుమర్రి పంప్‌హౌస్‌కు చేరుకుని అప్రోచ్ చానెల్ వెంట సాయంత్రం వరకు గాలించి వెనుదిరుగారు.

భక్త కోటి సేవలో..

- శ్రీశైలం దేవస్థానం వైద్యశాలలో మెరుగైన సేవలు
- భక్తులు, స్థానికులకు ఎంతో ఉపయోగం
- దాతల విరాళాలతో సౌకర్యాల కల్పన



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు నిత్యం తరలివస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం క్షేత్ర పరిధిలో దేవస్థానం విస్తృత సౌకర్యాలు కల్పిస్తోంది. గతంలో శ్రీశైల క్షేత్రానికి వచ్చే భక్తులు అనుకోకుండా అనారోగ్యానికి గురైనా.. ఏదైన ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినా.. దాదాపు 60 కి.మీ దూరంలో ఆంధ్రా వైపు దోర్నాల, తెలంగాణ వైపు అచ్చంపేట ఆసుపత్రికి తరలించాల్సి వచ్చేది. దీంతో అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందించేందుకు దేవస్థానం 1980 ఫిబ్రవరి 15వ తేదీన ఉచిత వైద్యశాలను ప్రారంభించింది. ప్రస్తుతం ఇందులో 24 గంటల పాటు నిరంతరంగా సేవలు అందుతున్నాయి. వైద్యశాల నిర్వహణకు దేవస్థానం హైదరాబాద్‌కు చెందిన అపోలో హాస్పిటల్ సహకారాన్ని తీసుకుంటోంది. అపోలో వైద్యశాల తరుపున వైద్యులు, నర్సులు సేవలందిస్తున్నారు. అపోలో వైద్యులకు దేవస్థానం ఉచిత వసతి, భోజనం తదితర ఏర్పాట్లను కల్పిస్తుంది. దేవస్థానం తరుపున ల్యాబ్ టెక్నీషియన్–1, గుమస్తా–1, అంబులెన్స్ డ్రైవర్లు–2, ముగ్గురు పారిశుద్ధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వైద్యశాలలో రోజుకు సగటున 150 మంది దాకా ఆయా వైద్య సేవలను పొందుతున్నారు. మహాశివరాత్రి, ఉగాది, కార్తీక మాసాల్లో అధికసంఖ్యలో భక్తులు వైద్యసేవలు పొందుతున్నారు. సంవత్సరంలో సుమారుగా మొత్తం 80 వేల మందికి పైగా వైద్యసేవలు అందుతున్నాయి.

ప్రత్యేక వైద్యపరికరాలు..

శ్రీశైల దేవస్థాన వైద్యశాలలో ఈసీజీ, కార్డియాక్ మానిటర్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, వెంటిలేటర్, డిఫిబ్లేటర్, కార్డిక్ మానిటర్, బైపాస్ మిషన్, నెబ్యులైర్, సెక్షన్‌పంపు లాంటి సదుపాయాలతో పాటు రక్తపరీక్షలకు సంబంధించి సీబీపీ కౌంటింగ్, సెమీ అనలైజర్, మొదలైన అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్యపరంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి అవసరమైన తక్షణ వైద్యాన్ని అందించి, ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు పంపించేందుకు 3 అంబులెన్స్‌లు కూడా ఉన్నాయి. వీటిలో ఒకటి అత్యంత అధునాతనమైన పరికరాలతో అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడనుంది.



అత్యాధునిక అంబులెన్స్



ఆసుపత్రికి వైద్యపరికరాలను అందజేస్తున్న దాత (ఫైల్)

నిర్వహణకు ఏటా రూ. 50 లక్షలు

వైద్యశాల నిర్వహణ కోసం దేవస్థానం సంవత్సరానికి రూ.50 లక్షలను కేటాయిస్తోంది. వైద్యశాలలో మందులన్నీ ఉచితంగా ఇస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్ల ద్వారా వైద్యశాలకు అవసరమైన మందులను కొనుగోలు చేస్తున్నారు. వీటికి తోడు దాతల నుంచి కూడా మందులను విరాళంగా పొందుతున్నారు. వైద్యశాల నిర్వహణ కోసం దేవస్థానం కొంత మూలధనంతో పాటు శ్రీభ్రమరాంబా మల్లికార్జున ప్రాణధాన ట్రస్ట్ పేర ప్రత్యేక ట్రస్టును కూడా నెలకొల్పింది. సమయానుసారంగా దేవస్థానం ఆయా విభాగాలలో ప్రత్యేక నైపుణ్యం గల వైద్యులను రప్పించి వైద్యశిబిరాలను కూడా నిర్వహిస్తుంది.

ప్రాణదాన ట్రస్ట్‌కు విరాళాలు ఇవ్వండి

శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా శ్రీభ్రమరాంబా మల్లికార్జున ప్రాణదాన ట్రస్ట్ పేర ప్రత్యేకంగా ట్రస్ట్‌ను నెలకొల్పాం. ఈ ట్రస్ట్‌కు దాతలు ఎంత మొత్తాన్ని అయినా విరాళంగా ఇవ్వవచ్చు. ఔషధ తయారీదారులు, మందుల దుకాణాల నిర్వాహకులు, మెడికల్ ఏజెన్సీలు వైద్యశాలకు అవసరమైన మందులను విరాళంగా అందజేయవచ్చు. అలాగే దాతలు వైద్యపరికరాలను కూడా విరాళంగా ఇవ్వొచ్చు. వైద్యసేవ పథకానికి రూ.లక్ష ఆపై మొత్తాన్ని విరాళంగా ఇచ్చే వారిని దేవస్థానం ప్రత్యేక దాతలుగా గుర్తిస్తుంది.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

క్లుప్తంగా

భార్గవ్‌రామ్‌పై కేసు నమోదు

ఆళ్లగడ్డ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి అనుచరుడైన చాకలి శీనుపై దాడి ఘటనలో ఎమ్మెల్యే అఖిలప్రియ భర్త భార్గవ్‌రామ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేష్‌బాబు శనివారం తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడి నంద్యాల వైద్యశాలలో చికిత్స పొందుతున్న చాకలి శీను ఫిర్యాదు మేరకు నిఖిల్, దుమ్మరి ప్రసాద్, సంపత్, కారు డ్రైవర్ (పేరు తెలియదు) భార్గవ్‌రామ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

జీడీపీలో పూడిక చేరికపై సర్వే


జీడీపీలో సర్వే చేస్తున్న దృశ్యం

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టులో పూడిక చేరికపై మూడు రోజుల నుంచి కేంద్ర జలశక్తి బృందం సభ్యులు సర్వేలు చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మించినప్పుడు నీటి నిలువ సామర్థ్యం ఎంత, ప్రస్తుతం నీటి నిలువ సామర్థ్యం ఎంత తదితర వివరాలు సేకరిస్తున్నారు. నీటిలో బోటులో తిరుగుతూ ప్రత్యేక మీటర్లతో సర్వే చేస్తున్నారు. నీరు లేని చోట డీజీపీఎస్ అనే పద్ధతిలో ఇక్కడ వరకు నీటిని ఎంత మేర నిలువ చేయవచ్చు అనే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నారు. సర్వే చేసే కేంద్రబృందం ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రాజెక్టులో ఎంత మేర నీటిని నిలువ చేసుకోవచ్చునో తెలియనుంది. అలాగే నివేదిక ప్రకారం ప్రాజెక్టులో ఎంత మేర పూడిక చేరింది.. ఆ పూడికను తొలగించాలా లేదా అనేది కూడా తేలనుంది. వారం రోజుల పాటు సర్వే కొనసాగనుందని అధికారులు తెలిపారు.

పల్లెల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు



డీపీఓ నాగరాజు నాయుడు

కర్నూలు(అర్బన్): స్టాప్ డయేరియా కాంపెయిన్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ నెల 1 నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా జరుగుతున్నాయని జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాలు ఆగస్టు 31 వరకు కొనసాగుతాయన్నారు. గ్రామీణ నీటి సరఫరా, వైద్యారోగ్య, విద్యా శాఖలకు చెందిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది సంయుక్తంగా పాల్గొంటారని తెలిపారు. దోమల నిర్మూలన, ట్యాంకులను శుభ్రం చేసే పనులు కొనసాగుతున్నాయన్నారు. చేతులను శుభ్రంగా కడుక్కునే విధానంపై అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది జింక్ టాబ్లెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్నారన్నారు.

ఇంటర్నెట్ సెంటర్‌పై విచారణ

ఆలూరు: అత్యధికంగా రైల్వే టికెట్లు బుకింగ్ కావడంతో ఆలూరు మెయిన్ బజారులో ఓ ఇంటర్నెట్ సెంటర్‌పై రైల్వే ప్రొటక్షన్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఒకే ఐడీ పేరుతో టికెట్లు బుకింగ్ కావడాన్ని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకుడు వివిధ ప్రాంతాలకు సంబంధించిన ప్రయాణికులకు ఏసీ1 టైర్, ఏసీ2 టైర్, ఏసీ 3టైర్ టికెట్లను బుకింగ్‌ను ఆన్‌లైన్‌ద్వారా అధికంగా చేస్తున్నారని ఆర్పీఎఫ్ అధికారులకు కొందరు సమాచారం అందించారు. అందులో భాగంగానే ఇంటర్నెట్ నిర్వాహకుడిపై రైల్వే ప్రొటక్షన్ పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అతను పూచీకత్తుతో బెయిల్‌పై వచ్చినట్లు తెలిసింది.

నకిలీ వైద్యం.. నమ్మితే ప్రమాదం!



➡ గోనెగండ్ల మండలం గంజిహల్లి గ్రామంలో మూడు వారాల క్రితం రాజేష్(12) బాలునికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీని సంప్రదించారు. అతను బాలునికి ఇంజెక్షన్ చేసిన చోట గడ్డ ఏర్పడింది. ఆ తర్వాత దాని నుంచి చీము, రక్తం కారడంతో తల్లిదండ్రులు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో కోలుకోలేక ఈ నెల 7వ తేదీన బాలుడు మృతి చెందాడు.

➡ ఈ బాలుడే కాదు పట్టణాల్లోని మురికివాడల్లో, గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న జబ్బులకు అక్కడి ప్రజలు స్థానికంగా వైద్యులుగా చెలామణి అవుతున్న వ్యక్తులను సంప్రదిస్తుంటారు. ఇందులో అధిక శాతం అప్పటికప్పుడు వ్యాధి నయం అవుతున్నా...కొందరికి భవిష్యత్‌లో, మరికొందరికి కొన్ని రోజుల తర్వాత రియాక్షన్ వస్తోంది. వారు మరో వైద్యుని వద్దకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. నకిలీ వైద్యుల చికిత్స వల్ల సైడ్‌ఎఫెక్ట్ వచ్చి మెరుగైన వైద్యం కోసం వచ్చే వారి సంఖ్య కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోజురోజుకూ పెరుగుతోంది.

- జిల్లా వ్యాప్తంగా నకిలీ వైద్యులు
- ఎలాంటి అనుమతులు లేకుండానే వైద్యం
- ప్రాథమిక చికిత్స వరకే అనుమతి పొందిన ఆర్ఎంపీలు
- అయినా ప్రసవాలు చేస్తున్న వైనం
- పలు చోట్ల ప్రైవేటు ఆసుపత్రుల నిర్వహణ
- పట్టీపట్టనట్లు ఉన్న వైద్య ఆరోగ్య శాఖ

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు, ల్యాబ్ డయాగ్నోస్టిక్ సెంటర్లు, క్లినిక్‌లు కలిపి 600లకు పైగానే ఉన్నాయి. ఇవి గాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా క్లినిక్‌లు, ఆసుపత్రులు నిర్వహిస్తున్నవి మరో వందకు పైగా ఉంటాయి. ఏదైనా ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్, స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నా ముందుగా వైద్య ఆరోగ్యశాఖ అనుమతి తీసుకోవాలి. ముందుగా తాత్కాలిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇస్తారు. ఆ తర్వాత మూడు నెలల అనంతరం పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌కు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే నిబంధనల ప్రకారం ఆసుపత్రిని ఏర్పాటు చేయలేని చాలా మంది రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు. ఇలాంటి అనుమతి లేని ఆసుపత్రుల కారణంగా ఎంతోమంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.



ఖర్చుకు భయపడి ఆర్ఎంపీల వద్దకు...

పట్టణ ప్రాంతాల్లోని మురికివాడలు, గ్రామీణ ప్రాంతాలు, మండల కేంద్రాలలో ఆర్ఎంపీలు చికిత్స కేంద్రాలను తెరుస్తున్నారు. నిరక్షరాస్యులైన అక్కడి ప్రజలు వీరి వద్దకు చికిత్స కోసం వెళ్తున్నారు. నిపుణులైన పెద్ద డాక్టర్ల వద్దకు, ఆసుపత్రులకు వెళ్లాలంటే వీరికి ఖర్చుతో కూడుకున్న పని. ఈ కారణంగా తాత్కాలిక ఉపశమనం కోసం స్థానికంగా ఉండే ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. వీరు తెలిసీ తెలియని వైద్యంతో వారికి చికిత్స చేసి ప్రాణాల మీదుకు తీసుకొస్తున్నారు. మరోవైపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు ఉండకపోవడం కూడా వీరికి కలిసొస్తోంది. కొందరు ఆర్ఎంపీలు సెలైన్‌లు(ఫ్లూయిడ్స్) ఎక్కించడంతో పాటు మరికొందరు ఏకంగా ప్రసవాలు చేస్తున్నారు. మరికొందరు ఏకంగా మైనర్ సర్జరీలు కూడా నిర్వహిస్తున్నారు. ఇన్ని చేస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వీరిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికీ కర్నూలుతో పాటు కల్లూరు, కోడుమూరు, గూడూరు, ఎమ్మిగనూరు, ఆదోని ప్రాంతాల్లో కొందరు ఆర్ఎంపీలు ఏకంగా ఆసుపత్రులే తెరుస్తున్నారు. ఆసుపత్రి నిర్వాహకులు వైద్యులే కానక్కరలేదని, ఎవ్వరైనా తెరవొచ్చన్న నిబంధనలతో విచ్చలవిడిగా వీరు ఆసుపత్రులు తెరుస్తున్నారు. ఇలా తెరిచిన వారు ఏకంగా వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో ఆటలాడుతున్నారు. కొన్నేళ్ల క్రితం కోడుమూరు, గూడూరు, ఇటీవల కర్నూలులో ఇలాంటి నకిలీ వైద్యులు తెరిచిన ఆసుపత్రులను అధికారులు సీజ్ చేసినా వారికున్న రాజకీయ పలుకుబడితో తిరిగి వాటిని తెరుచుకున్నారు.

ఆర్ఎంపీల విచ్చలవిడి వైద్యం

జిల్లాలో ఆర్ఎంపీల రాజ్యం నడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ఈ కారణంగా ఇక్కడ పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వద్దకు చాలా మంది చికిత్స కోసం వెళ్తున్నారు. కానీ సత్వరమే ఉపశమనం కోసం ఇప్పటికీ ఎక్కువగా వారికి పరిచయం ఉన్న ఆర్ఎంపీలనే ఆశ్రయిస్తున్నారు. వీరికి ఎలాంటి అర్హత లేకపోయినా వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వెళ్లిన ప్రతి ఒక్కరికీ ఇంజెక్షన్‌లు చేస్తున్నారు. ఇందులో నొప్పి నివారణ, స్టెరాయిడ్, విటమిన్ ఇంజెక్షన్లు తప్పనిసరిగా ఉంటున్నాయి. స్టెరిలైజ్ పద్ధతులు సరిగ్గా పాటించకపోవడం వల్ల చాలా మందికి ఇంజెక్షన్ వేసిన చోట ఇన్‌ఫెక్షన్లు అవుతున్నాయి. కొంత మందికి సెప్టిసీమియా ఏర్పడి ప్రాణం మీదకు వస్తోంది. ఇప్పటికీ కర్నూలులోని వన్‌టౌన్, బుధవారపేట, శ్రీరామనగర్, షరీన్‌నగర్, వీకర్‌సెక్షన్ కాలనీ, ఎన్‌టీఆర్ నగర్, కల్లూరు, కల్లూరు ఎస్టేట్ వంటి ప్రాంతాల్లో కొందరు ఆర్ఎంపీలు ఇష్టానుసారం వైద్యం చేస్తున్నారు. వీరిలో అధిక శాతం నేరుగా దుస్తులపైనే ఇంజెక్షన్ గుచ్చేస్తున్నారు. ఇలా చర్మాన్ని శుభ్రం చేయకుండా ఇంజెక్షన్ వేస్తే ఇన్‌ఫెక్షన్ వస్తుందన్న ఇంగిత జ్ఞానం కూడా వారికి ఉండటం లేదని నిపుణులైన వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



జిల్లాలో నకిలీ వైద్యుల గురించి పలు ఫిర్యాదులు వస్తున్నాయి. ఎంబీబీఎస్ చదివిన వారు మాత్రమే అల్లోపతి వైద్యం చేయాలి. ఇతరులు వైద్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ఆర్ఎంపీలు చాలా చోట్ల వారి స్థాయికి మించి వైద్యం చేస్తున్నారని మా దృష్టికి వచ్చింది. ఇకపై జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక దాడులు నిర్వహిస్తాం. స్థానికంగా విచారణ చేసి వారిపై చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌వో, కర్నూలు

అంతర్ జిల్లా ఈత పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేష్


ఈత పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్

కర్నూలు (టౌన్): నగరంలోని కిసాన్‌ఘాట్ వద్ద ఉన్న స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్‌పూల్‌లో శనివారం 9వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లా స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను మాజీ రాజ్య సభ సభ్యుడు టీజీ వెంకటేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానానికి అయ్యే రూ.50 వేలు మంత్రి టీజీ భరత్ పేరు మీద అందజేస్తానన్నారు. కర్నూలు నగరంలో తగిన స్థలం లభిస్తే మరొక స్విమ్మింగ్‌పూల్ నిర్మాణం చేపడతామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ , జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వి.మోహన్, కోశాధికారి రమేష్, ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, స్విమ్మింగ్ పూల్ కోచ్ నటరాజరావు, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహయ్య, కార్యదర్శి జి.రామకృష్ణ యాదవ్, ఉపాధ్యక్షులు రమేష్, సర్వేష్‌గౌడ్, కోశాధికారి దస్తగిరి, సంయుక్త కార్యదర్శులు రామకృష్ణ, శివరాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి హజరతయ్య, నిర్వహణ కార్యదర్శులు ఖాసీం, రవి, రాఘవేంద్ర, శివ, వెంకటేష్, దామోదర్,ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

1500 మీటర్ల ఫ్రీస్టైయిల్ బాలుర విభాగంలో సంపత్‌కుమార్ (బంగారు, కృష్ణా జిల్లా), తీర్థ సమాదేవ్ (వెండి, ఎన్టీఆర్ జిల్లా), హర్షవర్థన్ రాజు (కాంస్యం, బాపట్ల జిల్లా), బాలికల విభాగంలో..కనక లక్ష్మీ ప్రెట్టీ (బంగారు, విశాఖపట్నం), పీతల సరయు (వెండి, విశాఖపట్నం), 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ బాలుర విభాగంలో.. శరత్ (బంగారు, ఎన్టీఆర్ జిల్లా), కార్తికేయ (వెండి, గుంటూరు), హర్షవర్ధన్‌రాజు (కాంస్యం, బాపట్ల) బాలికల విభాగంలో.. హర్షిత బిల్లా (బంగారు, కృష్ణా జిల్లా), లక్ష్మీ పావని (వెండి, గుంటూరు) ,షణ్ముఖ శ్రీ సాయి (కాంస్య, కాకినాడ).

రైలు నుంచి జారి పడిన దంపతులు

- భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు
- నాలుగు నెలల క్రితం వివాహం



మృతి చెందిన యువకుడు సయ్యద్ ఆసిఫ్, గాయపడిన అఫ్రాబాను

డోన్ రూరల్: డోన్ – బెంగళూరు రైల్వే మార్గంలో ఎర్రగుంట్ల సమీపంలో శనివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ రైలు నుంచి దంపతులు జారి పడ్డారు. ఈ ప్రమాదంలో భర్త అక్కడికక్కడే మృతి చెందగా, భార్య తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం ఉడిపి సమీపంలోని సిరూర్ గ్రామానికి చెందిన సయ్యద్ ఆసిఫ్ (24), అఫ్రాబాన్‌కు నాలుగు నెలల క్రితం వివాహమైంది. వీరిద్దరూ ఇటీవల గుంటూరులో బంధువుల దగ్గరికి వెళ్లారు. శుక్రవారం రాత్రి ఉద్యోగ నిమిత్తం బెంగళూరు వెళ్లేందుకు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. కాగా డోన్ రైల్వే స్టేషన్ దాటిన తర్వాత శనివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో బోగి డోర్ వద్ద ఉన్న నిల్చున్న వారిలో ముందుగా అఫ్రాబాన్ జారి కింద పడింది. ఆ వెంటనే ఆమెను కాపాడాలనే ఆతృతతో సయ్యద్ ఆసిఫ్ కూడా కిందుకు దూకేశాడు. ప్రమాదాన్ని గమనించిన ప్రయాణికులు వెంటనే చైన్ లాగి రైలును నిలిపారు. రైల్వే గార్డ్‌కు సమాచారం ఇవ్వగా ట్రాక్ వెంబడి గాలించగా సయ్యద్ ఆసిఫ్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మహిళ కోసం గాలించగా ఆచూకీ లభించలేదు. అదే రైలును వెనక్కి మళ్లించి యువకుడి మృతదేహాన్ని డోన్ రైల్వే స్టేషన్‌కు తరలించి పోలీసులకు అప్పగించారు. తీవ్ర గాయాలైన అఫ్రాబాన్ చీకట్లోనే నడుచుకుంటూ ప్రధాన రహదారిపై ఉన్న పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగా అక్కడే ఉన్న స్థానికులు డోన్ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. భర్త చనిపోయిన విషయం ఇంకా ఆమెకు తెలియలేదు. వారి బంధువులకు సమాచారం అందించామని రైల్వే పోలీసులు తెలిపారు.

సాహిత్యంతో సామాజిక చైతన్యం

- రాయలసీమ అస్థిత్వ ఉద్యమనేత భూమన్


ప్రణయ హంపి పుస్తకావిష్కరణలో సాహితీవేత్తలు

ఎమ్మిగనూరు: సాహిత్యంతో సామాజిక చైతన్యం సాధ్యమవుతోందని రాయలసీమ అస్థిత్వ ఉద్యమనేత భూమన్ పేర్కొన్నారు. స్థానిక కుర్ని కల్యాణ మంటపంలో సాహిత్యవేత్తలు, విద్యా–సామాజిక వేత్తల సమక్షంలో రచయిత మారుతి పౌరోహితం రచించిన 'ప్రణయ హంపి' నవలావిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. రచయిత్రి నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాయలసీమ అస్థిత్వ ఉద్యమనేత భూమన్, సీనియర్ జర్నలిస్టులు తాడి ప్రకాష్, అరుణాంక్ లత, ముక్కమాల చక్రధర్, విరసం కార్యదర్శి పాణి, అనంతు చింతలపల్లి, రచయితలు వెంకటకృష్ణ, ఇనాయతుల్లా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ నరవ రమాకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శశిరేఖ హాజరయ్యారు. ఎమ్మిగనూరు ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు, రచయిత మారుతి పౌరోహితం సాహిత్య ప్రస్థావనాన్ని, రచనల ఔన్నత్యాన్ని కొనియాడారు. కృష్ణదేవరాయల విజయనగర సామ్రాజ్య వైభోగంపై కథలు వచ్చాయని, ఆయన పాలనలో సామాన్య సేనాని, వేశ్య మధ్య పొడచూపిన ప్రేమను సాహిత్య ప్రియులకు నచ్చేలా..చరిత్రకారులు మెచ్చేలా మారుతి 'ప్రణయ హంపి'ని సృజించిన తీరు అభినందనీయమని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో గజల్ గాయకులు మహ్మద్ మియా పాటలు అందరినీ అలరించాయి. బీసీ ఐక్యవేదిక నాయకులు గణేష్, రోటరీ క్లబ్ మాజీ కార్యదర్శి కేఆర్ శ్రీనాథ్‌రెడ్డి, కడిమెట్ల సొసైటీ సీఈఓ దత్తాత్రేయస్వామి, రెవెన్యూ అధికారి శశిశేఖర్, శ్రీనివాసులు, డీఎస్పీ వినోద్ కుమార్, వివిధ ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సాహిత్య ప్రియులు పాల్గొన్నారు.

బాలిక ఆచూకీ గుర్తింపులో ప్రభుత్వ వైఫల్యం

- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి


బాలిక తల్లిదండ్రులను పరామర్శించేందుకు కొత్త ఎల్లాల గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి

పగిడ్యాల: ముచ్చుమర్రి పంచాయతీలోని కొత్త ఎల్లాల గ్రామంలో అదృశ్యమైన బాలిక ఆచూకీని గుర్తించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి విమర్శించారు. శనివారం ఆయన కొత్త ఎల్లాలకు చేరుకుని బాలిక కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఆయన విలేకరులతో బాలిక ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారినా ఇప్పటి వరకు హోం మంత్రి స్పందించకపోవడం బాధాకరమన్నారు. బాలిక అదృశ్యంలో నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. నిందితులు చిన్న ప్రాయంలోనే నేరప్రవృత్తి కలిగి ఉండటం శోచనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల రక్షణ కోసం దిశ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. లేదంటే వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట నందికొట్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు, 80 బన్నూరు సహకార సొసైటీ మాజీ చైర్మన్ రమణ, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగశేనారెడ్డి, బోయ మధు, రాంబాబు, రాజు, వాల్మీకి సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.